RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 302 | ఆదివారం19 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు :6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్

**కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ**

**కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళుతున్నారని ఆగ్రహం**

**కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వుతున్నారని విమర్శ**

సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.
రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.



రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## ఉద్యమం చేసిన సాధించిన తెలంగాణను తేజస్వీ అవమానించారు: పొన్నం ప్రభాకర్

**-తేజస్వీ మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు నోరు మెదపలేదని విమర్శ**

**-తేజస్వీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్**

**-మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ మద్దతిస్తుందని వ్యాఖ్య**

దశాబ్దాలుగా ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను బీజేపీ కర్ణాటక ఎంపీ తేజస్వీ సూర్య అవమానించారని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆయన అవమానిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు కూడా మెదపలేదని విమర్శించారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల్లో ఉండకూడదని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని మంత్రి అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో కలపకుంటే కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ ఇచ్చారు. కానీ కేంద్ర ప్రభుత్వం



కుట్రపూరితంగా డీలిమిటేషన్‌తో కలిపి మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టిందని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

## పవన్ కల్యాణ్‌కు తీవ్ర అస్వస్థత...

**హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స
అధికారులతో సమావేశంలో అస్వస్థతకు గురైన పవన్
వారం నుంచి పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచన
పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందని వెల్లడి
పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ ప్రకటన



2

## మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యే:

**-విపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం**

మహిళా రిజర్వేషన్లకు చుక్కెదురు

నేడు జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ

ఈ పాపంలో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ ప్రధాన దోషులని తీవ్ర విమర్శ

దేశానికి మేలు చేసే ప్రతి సంస్కరణను కాంగ్రెస్ అడ్డుకుంటుందని ఆరోపణ

సంఖ్యాబలం తక్కువగా ఉన్నా మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం ఆపబోమని స్పష్టీకరణ

విపక్షాలకు మహిళలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్య

2

భారత రాజకీయాల్లో మహిళలకు చారిత్రక సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్' సవరణను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు "గర్భంలోనే చంపేశాయని" ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోక్‌సభలో ఈ బిల్లు వీగిపోవడంపై శనివారం సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇది కేవలం బిల్లు ఓటమి కాదని, భారత మహిళల ఆకాంక్షలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ చారిత్రక తప్పిదంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే పక్షాలదే ప్రధాన పాపమని నేరుగా ఆరోపించారు.



## ఏఐకి ఎలాంటి భావోద్వేగాలు ఉండవు

**ఏఐ విషయంలో ఆందోళనలు వద్దన్న ప్రధాన న్యాయమూర్తి**

**కేసులను పరిష్కరించడానికి నైతిక విలువలు అవసరమన్న సీజేఐ**

కృత్రిమమేధ (ఏఐ) వినియోగంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో ఏఐ వాడకంపై ఆయన సూచనలు చేశారు. ఏఐ విషయంలో ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు.



2

## దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా:



2

**2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**
**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి**
**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**

2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు.
ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# మహిళా బిల్లుకు అడ్డుపడటం చారిత్రక తప్పిదం

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళలకు న్యాయం చేసే విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ మోసం చేస్తోందని ఆరోపించారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా తాను ఉన్నప్పటి నుంచి, వాజ్‌పేయి హయాంలోనూ ఈ బిల్లును అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని గుర్తుచేశారు. 2010లో యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లును ఆమోదించి, లోక్‌సభలో ప్రవేశపెట్టకుండా మహిళలను వంచించిందని విమర్శించారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో బిల్లు వస్తే, డీలిమిటేషన్ పేరుతో చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే తప్పుడు వాదనతో అడ్డుకున్నారని మండిపడ్డారు. సీట్లు తగ్గవని కేంద్రం హామీ ఇచ్చినా, కావాలనే పక్కదారి పట్టించి మహిళలకు ద్రోహం చేశారని అన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు ఎన్డీయే ప్రభుత్వం మహిళల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

**స్వచ్ఛాంధ్రతో స్వర్ణాంధ్ర సాధన**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని చెత్తకుప్పగా మార్చిందని, దానిని శుభ్రపరిచే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 9000 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, పేరుకుపోయిన 153 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తలో ఇప్పటికే 114 లక్షల టన్నులు తొలగించామని, జూన్ నాటికి రాష్ట్రాన్ని పూర్తి పరిశుభ్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు.

చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఆధునిక ప్లాంట్లను అక్టోబర్ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. "స్వచ్ఛ రథాల" ద్వారా ఇళ్లలోని పాత వస్తువులను సేకరించి, వాటికి ధర కట్టి నిత్యావసరాలు ఇచ్చే సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు.

**అధికారుల పనితీరుపై సీఎం సమీక్ష**

ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు తనదైన శైలిలో అధికారుల పనితీరును సమీక్షించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన సంతృప్తి స్థాయి డేటాను విశ్లేషిస్తూ, నిడదవోలు నియోజకవర్గంలో వివిధ శాఖల పనితీరును బహిరంగంగా వెల్లడించారు. రాష్ట్ర సగటు కంటే మెరుగైన పనితీరు కనబరిచిన జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులను అభినందించారు.

అదే సమయంలో, ఆర్టీసీ బస్ సర్వీసులు, ఫైర్ సర్వీసెస్, రెవెన్యూ వంటి శాఖల్లో సంతృప్తి స్థాయి తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను నిలదీశారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని వారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా**

ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని, అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి పేదవాడి ఆకలి తీరుస్తున్నామని అన్నారు. పోలవరం ప్రాజెక్టును పుష్కరాల లోపు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు స్వచ్ఛందంగా భూములివ్వడంతో అమరావతి నిర్మాణం వేగవంతమవుతోందన్నారు.

నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి కోరిన వంతెనల నిర్మాణం, ఆసుపత్రి అభివృద్ధి, రోడ్ల విస్తరణ వంటి పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. విధ్వంస రాజకీయాలు చేసే పార్టీలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యే

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈ పరిణామం తనను తీవ్రంగా బాధించిందని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ సవరణ ఎవరి హక్కులనూ హరించడానికి కాదు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలకు దశాబ్దాలుగా నిరాకరించిన హక్కులను అందించడానికే. మేం నిజాయతీతో, స్పష్టమైన ఉద్దేశంతో చేసిన ఈ పవిత్ర మహాయజ్ఞాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి" అని మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో భారత మహిళలకు కొత్త అవకాశాలు కల్పించి, వారి పురోగతికి అడ్డంకులను తొలగించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. దేశాభివృద్ధిలో మహిళలను నిజమైన భాగస్వాములుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.కాంగ్రెస్‌కు మహిళా రిజర్వేషన్లపై మొదటి నుంచి వ్యతిరేకతే ఉందని, గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా ఆ పార్టీ అడ్డుకున్న చరిత్రను ప్రధాని గుర్తుచేశారు. "ఈసారి కూడా తప్పుడు వాదనలు, పక్కదారి పట్టించే ఎత్తుగడలతో చట్టాన్ని అడ్డుకున్నారు. ఈ చర్యలతో ఆ పార్టీలు భారత మహిళల ముందు తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి. దశాబ్దాల నాటి తప్పులను సరిదిద్దుకునేందుకు వచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకుంది" అని విమర్శించారు. కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీలు మహిళలు రాజకీయంగా ఎదగడాన్ని సహించలేవని ఆరోపించారు.సంస్కరణలను వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మోదీ విమర్శించారు. "జన్ ధన్, జీఎస్టీ, డిజిటల్ చెల్లింపులు వంటి కీలక సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. సైనికుల కోసం తెచ్చిన 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'ను 40 ఏళ్ల పాటు అడ్డుకున్న చరిత్ర వారిది. ఉగ్రవాదం, నక్సలిజంపై ఆ పార్టీ వైఖరిని దేశం మర్చిపోదు" అని మోదీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవి అని, ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బతుకుతోంది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారుడీలిమిటేషన్ అంశంపై కూడా విపక్షాలు అసత్య ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాయని మండిపడ్డారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, పైగా అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని తాను హామీ ఇచ్చినా వినలేదన్నారు."ఈ బిల్లును అడ్డుకోవద్దని, కావాలంటే ఈ ఘనతను మీరే తీసుకోండని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేసినా వారు పెడచెవిన పెట్టారు. ఇవాళ మాకు సంఖ్యాబలం తక్కువగా ఉండొచ్చు. కానీ మహిళా రిజర్వేషన్ సాధన కోసం మా పోరాటం ఆగదు. చట్టసభల్లోకి రావాలన్న మహిళల కలలను ధ్వంసం చేసిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు రాబోయే ఎన్నికల్లో దేశ మహిళలు గట్టిగా బుద్ధి చెబుతారు. వారు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి" అని మోదీ హెచ్చరించారు. ఈ బిల్లును అడ్డుకున్న పాపం ఆ పార్టీలను జీవితాంతం వెంటాడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

# టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధిస్తోంది

సీనియర్ జర్నలిస్టులైన పూడి శ్రీహరి, కేవీఆర్‌లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు జగన్ తెలిపారు. "బీసీ వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూడి శ్రీహరి చేసిన తప్పేంటి? అతనిపై అక్రమ కేసులు పెట్టి, ఇంట్లో సోదాలు చేయడానికి అతనేమైనా ఉగ్రవాదా? టెర్రరిస్టా?" అని జగన్ ప్రశ్నించారు. అదేవిధంగా, తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ ఇంట్లో లేని సమయంలో ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు. పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని నిలదీశారు.గడిచిన రెండేళ్లలో మహిళలు, బాలికలపై జరిగిన ఎన్నో దాడుల ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, తమను ప్రశ్నించిన వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతోందని జగన్ విమర్శించారు. "మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదు. కానీ, వాస్తవాలు మాట్లాడితే మీకు ఎందుకు అంత ఉలుకు?" అని ప్రశ్నించారు.పౌరులకు రక్షణ కల్పించడంలో విఫలమై, స్వార్థ రాజకీయాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సుపరిపాలన అవుతుందా అని జగన్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, ఈ చర్యలకు కచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "మీరు చేస్తున్న దుర్మార్గాలకు దేవుడు, ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది" అని జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కక్ష సాధింపు చర్యలు, అక్రమ అరెస్టులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు

# జగన్, బీజేపీ మధ్య రహస్య పొత్తు తేటతెల్లమైంది

వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు.తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు.మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కలు, కులగణన పూర్తయ్యాక, ఆ గణాంకాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని వివరించారు.అధికారిక గణాంకాలు లేకుండానే సీట్లు పెంచి దేశాన్ని ఉద్ధరిస్తున్నామని బీజేపీ చెబితే, జగన్ గుడ్డిగా నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ మూడు పార్టీలూ మోదీ మెప్పుకోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నది తామేనని ఆమె పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్‌కు తీవ్ర అస్వస్థత..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం ఉదయం అధికారులతో సమావేశంలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు.వ్యక్తిగత వైద్యుల సూచన మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను కూడా పవన్ కల్యాణ్ రద్దు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలతో పాటు ఎంఆర్ఐ కూడా నిర్వహించారు. రిపోర్టులను సమీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించి విజయవంతంగా పూర్తి చేశారు.వారం నుంచి పది రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత పవన్ కల్యాణ్ తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన పూర్తిస్థాయిలో కోలుకోవడానికి గణనీయమైన సమయం పడుతుందని, దీర్ఘకాలికంగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వివరాలను జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.కాగా, పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించినట్టు తెలుస్తోంది.

# ఏఐకి ఎలాంటి భావోద్వేగాలు ఉండవు

కర్ణాటక రాష్ట్ర స్టేట్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతౌల్యత పాటించాలని అన్నారు.క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని, దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారని ఆయన అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాబట్టి ఏఐ గురించి ఆందోళన అవసరం లేదని అన్నారు.న్యాయాధికారులు ఉత్పాదకతను పెంచడానికి తగిన శిక్షణ తీసుకుంటారని, శ్రద్ధతో పనిచేస్తారని అన్నారు. కానీ ఏఐ డేటా ఆధారంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. మనుషులకు ఉండే విచక్షణ శక్తి ఏఐకి ఉండదని, నిర్ణయాలు తీసుకునే సమయంలోనూ మనుషుల్లా ఆలోచించదని తెలిపారు. కేసులను పరిష్కరించడానికి నైతిక విలువలు, సామాజిక కోణాలు, రాజ్యాంగ నియమాలు, విలువల కట్టుబాటు ఉంటాయని, కానీ ఎలాంటి భావోద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదని అన్నారు

# దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా: సీఎం రేవంత్ రెడ్డి

సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరపున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

# బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పై నూతన పాట ఆవిష్కరణ రాయదుర్గంలో ఘన కార్యక్రమం



రంగారెడ్డి( )
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ అభిషేక్ గౌడ్ మరియు రాష్ట్ర యువ నాయకులు శశాంక్ గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిపై నూతనంగా రూపొందించిన పాటను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ గారు పాల్గొని, నాయకత్వం, సేవాభావం, ప్రజల పట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. అలాగే యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మరియు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ గారు కూడా హాజరై నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
ఆదివారం19 ఏప్రిల్ 2026

# నిమ్జ్ రైతులకు, కూలీలకు పునరావాసం ఇవ్వాలి.

## - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. రాంచందర్





జహీరాబాద్

నిమ్జ్ పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు, వ్యవసాయ కూలీలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, హై కోర్టు ఆదేశాల ప్రకారం పునరావాసం ఇవ్వకుండానే భూములను అధికారులు స్వాధీనం చేసుకోవడం ఫెన్సింగ్ వేయడం చర్యను వెంటనే నిలిపివేయాలని, కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జహీరాబాద్ పట్టణం లోని శ్రామిక్ భవన్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. రాంచందర్ మాట్లాడుతు
హై కోర్టులో డబ్ల్యూ పి నెంబర్ 677/2016 డివిజన్ బెంచ్ కోర్టు ఆదేశాల ప్రకారం వ్యవసాయ కూలీలకు 2013 చట్టంలో పేర్కొన పునరావాసం అందించాని, రైతులను భూములలో నుండి బయటకు పంపరాదాని, రైతులు వ్యవసాయం కొనసాగించాలని తెలిపిన్నారు. ఈ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహారిస్తూ పోలీసులతో బెదిరింపులకు దిగడం చర్యలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అన్నారు..
జిల్లా కలెక్టర్ ఆర్డిఓ లకు రెవెన్యూ యంత్రాంగానికి నిమ్జ్ అధికారులకు పలు దఫాలుగా వినతి పత్రాలు రాతపూర్వకంగా ఇచ్చిన పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ఏకపక్షంగా వీరి సమస్యలు పరిష్కారం చేయకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించడం సరైన చర్య కాదు అన్నారు. ఈ చర్య 2013 భూ సేకరణ చట్టాన్ని, హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది అన్నారు. ఇందుకు నిరసనగా గౌరవ హైకోర్టులో ఇప్పటికే కోర్టు ధిక్కరణ కేసు వేయడం జరిగిందని అన్నారు. అయినా కూడా అధికారులలో మార్పు లేకపోవడం ఏకపక్షంగా ముందుకు పోవడం చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం అధికార యంత్రాంగం ఇప్పటికైనా కోర్టు ఆదేశాలను అమలు చేస్తారా లేదా 2013 భూ సేకరణ చట్టంలో ఉన్న హక్కులను రైతులకు, కూలీలకు ఇస్తారా లేదా అనే విషయాలను ప్రకటించాలని డిమాండ్ చేసినారు.రైతులకు ఉన్న భూమి కంటే తక్కువ భూమికి పరిహారం చెల్లించారని అలాంటి వారందరికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలని, ఇప్పటివరకు సేకరించని భూములను సైతం ఫెన్సింగ్ వేయడం కోసం హద్దులు పాతి రైతులను పోలీసులతో బెదిరించడం చర్యలను మానుకోవాలని నష్టపరిహారం ఇచ్చిన తర్వాత మాత్రమే భూముల్లోకి వెళ్లాలని డిమాండ్ చేసినారు. ఇట్టి విషయాలపై అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.సారవంతమైన భూములు వ్యవసాయ యోగ్యమైన భూములను తీసుకోరాదని ఎంత విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా బలవంతంగా నైనా భూములు తీసుకోవడానికి సిద్ధపడటం చట్టాలను ఉల్లంఘించడం సమంజసం కాదని బలవంతపు భూసేకరణ వెంట నిలిపివేయాలని డిమాండ్ చేసినారు.రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రిజిస్ట్రేషన్ విలువల పేరుతో రైతులను దగా చేస్తున్నారని అన్నారు. వాస్తవంగా ఉన్న భూముల ధరను రిజిస్ట్రేషన్ లో నమోదు చేసిన తర్వాత మాత్రమే భూసేకరణకు నోటిఫికేషన్ వెయ్యాలని డిమాండ్ చేసినారు. ఆ విధంగా వేయకుండా కేవలం రిజిస్ట్రేషన్ విలువలు సవరించకుండా వాస్తవ ధరల నమోదు చేయకుండా రైతులకు నష్టపరిహారం పేరుతో ఎకరానికి 15 లక్షల మాత్రమే చెల్లించడం రైతుల్ని మోసం చేయడం కాదా అన్నారు. రైతుల అభ్యంతరాలు పట్టించుకోకుండా ఏకపక్షంగా అవార్డు ప్రకటించడం తో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తుందా అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో పరిపాలన నడుస్తుంది అనడానికి నిదర్శనం అన్నారు. భూముల మార్కెట్ విలువలు సవరించే వరకు వేసిన నోటిఫికేషన్ రద్దు చేసుకోవాలని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బహిరంగంగా ఉన్న మార్కెట్ల అమ్మకాలను కొనుగోలను పరిగణలోకి తీసుకొని వాస్తవదారాలను రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్లో నమోదు చేయాలని దాని ఆధారంగా 2013 భూ సేకరణ పేర్కొన్న పద్ధతుల్లో నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఉద్యమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం నాయకులు పాస్తాం. తుల్జారాం, బర్దిపూర్, ఎల్గొయి, ముంగి గ్రామాల రైతులు, కూలీలు ఎం శంకర్, ఎం గోపాల్, తెలుగు అంజన్న, పుష్పలత, అనిత, శివాని, విరమ్మ, బద్రునిషా, రోజమ్మ, బాలప్ప, సిదమ్మ, పద్మమ్మ, స్వప్న, గైబమ్మ, తదితరులు పాల్గొన్నారు



# లింగాయత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్త ధన శిబిరం



జహీరాబాద్

లింగాయత్ యూత్ అసోసియేషన్ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో పట్టణం లోని బసవ ఫంక్షన్ హాల్ ఆచార్య కాలేజ్ రోడ్డులో జరిగిన రక్త దాన శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్,జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ ఈ సంధర్భంగా ఎమ్మెల్యే ,చైర్మన్ మాట్లాడుతూ అందరికీ ముందుగా బసవ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.రక్త దానం చేయడం ఒక పుణ్య కార్యం అని ,బసవ జయంతి పురస్కరించుకొని ప్రతి సంవత్సరం లింగాయత్ సమాజ్ వారు నిర్వహిస్తున్న రక్త దాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. , అనంతరం రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ సుభాష్, వినయ పాటిల్ , కౌన్సిలర్ విశ్వేశ్వర్ ,నాయకులు ప్రభు పటేల్,నగేష్ , తదితరులు పాల్గొన్నారు.....



# అతివేగం ప్రమాదాలకు దారి తీస్తుంది

## -సర్పంచ్ తనయుడు భీమ్ రావ్ రాథోడ్ ఆధ్వర్యంలో హెల్మెట్ పంపిణీ

జహీరాబాద్

అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని రోడ్డు భద్రత పోలీస్ సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జహీరాబాద్ రూరల్ ఎస్ ఐ కాశినాథ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అరైవ్ అలీవ్ క్యాంపెయిన్ -2026 ట్రాఫిక్ రూల్స్ పైన అవగాహన కార్యక్రమం హెల్మెట్ పంపిణీ కార్యక్రమం ఉగ్గెల్లి తండా గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ ఐ కాశినాథ్ పాల్గొని మాట్లాడారు మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వకూడదని,ప్రతిఒక్కరు తప్పనిసరి హెల్మెట్ వాడాలని సూచించారు, ట్రాఫిక్ నిబందనలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత పడాలని అన్నారు, వివిద పనులపై వాహనములు నడుపువారు క్షేమంగా తిరిగి రావాలని విజ్ఞప్తి చేసారు , ఏదైనా జరగరాని, సంఘటన జరిగితే వారి కుటుంబం పడే బాధ వర్ణనాతీతం అని తెలిపారు.
ఏ సమస్యలు వచ్చినా పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని తెలిపారు. సర్పంచ్ ప్రతినిధి భీమ్ రావ్ రాథోడ్,గ్రామ కార్యదర్శి సమత,హెడ్ మాస్టర్ శర్మ , ఉపసర్పాంచ్ కంటి రామ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు బికు రాథోడ్, దీవి దాస్ , గోనె, కిషన్, లాలూ, రవీందర్,కృష్ణ, సాయి కిరణ్, సునీల్, అనిల్,చందు, విజయ్,రాజు, మధు, ప్రభు, రాహుల్, రవి, పరశురామ్ పాల్గొన్నారు



# తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలి:ఎంఈవో నర్సిములు

రాయికోడ్:ఏప్రిల్ 18

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పరిధిలోని హుల్గెర గ్రామంలో శనివారం నాడు మండల విద్యాధికారి నర్సిములు గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీలు పని చేసే చోటుకు వెళ్లి బడి బాట కార్యక్రమం లో భాగంగా వారికి అవగాహన కల్పించారు. ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని సూచిస్తూ,ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫాం,మధ్యాహ్న భోజనం కిట్టు వంటి సదుపాయాలను వివరించారు.ఈ బడి బాట కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరేలా కృషి చేయడం,చదువు మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్,ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది,ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహ,ఉపసర్పంచ్ అశోక్,ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్,గ్రామ పెద్దలు నగేష్, ప్రధానోపాధ్యాయులు అఖిలేష్ ఉపాధ్యాయులు కోటేశ్వర్,మరియు సీఆర్పీ రాజు,ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన..

## - ఆకట్టుకుంటున్న మొక్కజొన్న 609 రకం.



ఝరాసంగం, ఏప్రిల్ 18:

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిక్కేపల్లి గ్రామంలో శనివారం శ్రీ రామ అగ్రి జెనెటిక్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారు 609 మొక్కజొన్న రకంపై నిర్వహించిన మెగా ఫీల్డ్ డే కార్యక్రమం అత్యంత విజయవంతమైంది. స్థానిక రైతు అంజన్న సాగు చేసిన మొక్కజొన్న క్షేత్రాన్ని ఈ సందర్భంగా ఇతర రైతులకు ప్రదర్శించారు. మొక్కజొన్న 609 రకం విత్తనాలతో ఆశించిన దానికంటే మించిన దిగుబడి రావడంతో రైతు అంజన్న తన పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. కంకి పరిమాణం, గింజ నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ క్షేత్ర ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 75 నుండి 85 మంది రైతులు హాజరయ్యారు. పంట ఎదుగుదల మరియు దిగుబడిని చూసి తోటి రైతులు హర్షం వ్యక్తం చేశారు. విత్తన నాణ్యత. దిగుబడి పట్ల అటు రైతులు, ఇటు డీలర్లు కూడా పూర్తి సంతృప్తిగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి విభాగానికి చెందిన ఈ. మహేష్, డీలర్లు రైతులు పాల్గొని పంట సాగులోని మెళకువలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడిని ఇచ్చే ఇటువంటి వంగడాలను సాగు చేయడం వల్ల రైతులకు మంచి లాభాలు లభిస్తాయని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

# సెట్విన్ శిక్షణ కేంద్రాల బలోపేతమే లక్ష్యం

## -సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి



జహీరాబాద్ ఏప్రిల్ 18

రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ శిక్షణ కేంద్రాల కో-ఆర్డినేటర్లతో శనివారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ కేంద్రాల ప్రస్తుత పనితీరును సమీక్షించిన చైర్మన్, భవిష్యత్తులో చేపట్టబోయే నూతన కోర్సులు, కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ జె. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలను చేరవేయడంలో డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సమావేశంలో సెట్విన్ అధికారులు అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జగన్నాథన్, ట్రైనింగ్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి మానవతను చాటిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి మమత రాజు దంపతులు

సదాశివ పేట

మానవతకు మారుపేరు పులిమామిడి రాజు సొంత నిధులతో కబ్రస్తాన్‌లో బోరుబావి వేహించిన 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు సదాశివపేటపట్టణంలోని పాత పెరుమాళ్ళ ఆలయ సమీపంలో జాతీయ రహదారి 65 వద్ద గల ముస్లిం సోదరులకు చెందిన కబ్రస్తాన్ ప్రాంగణంలో చాలా రోజుల నుండి నీటి సమస్య ఉందని, వారు పులిమామిడి రాజును కలిసి చెప్పిన వెంటనే కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు స్పందించి తనసొంత నిధులతో బోరుబావిని వేయించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించారు. కబ్రస్తాన్‌కు వచ్చే ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఈ బోరు బావి ఉపయోగ పడుతుందన్నారు. ఈ నూతన బోరుబావి ఏర్పాటుతో ప్రస్తుతం అక్కడికి వచ్చే ప్రజలకు మంచి నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు సేవాభావాన్ని అభినందిస్తూ, ప్రజల సమస్యలపై చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని వారిని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కబ్రస్తాన్ కమిటీ సభ్యులు అక్బర్ హుస్సేన్, మక్సుద్, మహమ్మద్ ఫయాజ్, సర్వర్, అన్వర్, పర్వేజ్, హాజీ పటేల్, హర్షద్, రఫీ, జబ్బార్ మరియు పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు



హైదరాబాద్ ఎస్టేట్
ఆదివారం19 ఏప్రిల్ 2026

# అరైవ్ అలైవ్‌తో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
రంగారెడ్డి జిల్లా: తెలంగాణ రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా మార్చేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రోజు అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో "అరైవ్ అలైవ్" నినాదంతో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టిందన్నారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని, వారి జీవితాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమం విజయవంతం కాదని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ప్రమాదాల్లో గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి చేరిస్తే ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంటలో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల పారితోషికంతో 'రహవీర్ అవార్డు' అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువత, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

శాసనసభ్యుడు అరికెపూడి గాంధీ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ఎంతో అవసరమని తెలిపారు. అతివేగం, హెల్మెట్ వినియోగం లేకపోవడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

రాష్ట్ర రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా అమలు చేయడమే ప్రమాదాల నివారణకు మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వారు రోడ్డు నిబంధనలు పాటిస్తామని, ప్రమాదాలు జరగకుండా తమ బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో ఉత్తమ డ్రైవర్లుగా దేశ్య, రమేష్, కేబీ సింగర్‌లను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, రవాణా శాఖ అధికారులు, డ్రైవర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది కార్యక్రమం,

బి. కోడూరు ఏప్రియల్ 18,కడప జిల్లా బి. కోడూరు మండలంలో
ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మేకవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడ్మిషన్ల కొరకు పరిసర ప్రాంతాలలో తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను బడిలో చేర్పించవలసిందిగా కోరడమైనదని



మండల విద్యాశాఖ అధికారి మూరతోటి సునీల్ కుమార్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ కొండయ్య , ఉపాధ్యాయులు దేవదత్తం, బ్రహ్మయ్య, పవన్ మరియు వీర కుమార్ లతో కలిసి విద్యార్థుల గృహాల వద్దకు వెళ్ళి వారి తల్లిదండ్రులతో అడ్మిషన్ల గురించి మాట్లాడటం జరిగిందని అన్నారు. మేక వారి పల్లి ప్రాథమికోన్నత పాఠశాల గత సంవత్సరము ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించబడినదని, అంతేకాకుండా పీఎం శ్రీ పాఠశాల స్థాయిని కలిగి ఉండటం వలన పాఠశాలకు అతి త్వరలోనే మంచి సౌకర్యాలు విద్యార్థులకు చేరువ అవుతాయని తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తిని కనబరచటం జరిగిందని దాదాపు పదిమంది విద్యార్థులు నూతనంగా చేరడానికి వారి తల్లిదండ్రులు తమ అభిప్రాయాన్ని తెలియజేశారని తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు ప్రతి గ్రామంలో బడి పిలుస్తుంది కార్యక్రమం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్య తో పాటు వివిధ జీవన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాన్ని కలిగించాలని కోరమన్నారు.

## కందిమల్లాయపల్లె 2 నందు పోషణ పక్వాడ కార్యక్రమం....

### -ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రత్యూష...

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 18 :
మండల కేంద్రంలోని కందిమల్లయపల్లె 2 అంగన్వాడి సెంటర్ నందు శనివారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. 1 ) సున్నా నుండి రెండు సంవత్సరంలోపు పిల్లల్లో మెదడు అభివృద్ధి 80% జరుగుతుంది2). పిల్లల పెరుగుదల శారీరక, మానసిక అభివృద్ధి కి పిల్లలలో ప్రేరణ తల్లులు ఏ విధంగా ఇవ్వడం జరిగింది.3) పోషణ విషయం లో జంకు ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను, గురించి ,4)మొబైల్ వాడడం వలన పిల్లల్లో బుద్ధిమాంద్యం ఏర్పడుతుంది అంశాలపైన అవగాహనా కల్పిస్తూ 5)ప్రతి ఇంటికి మునగాకు చెట్టు ఉండాలి అని మునగాకు సంపూర్ణ పోషకారం అని, మునగాకు లో కాల్షియమ్, ఐరన్, విటమిన్ 12 వంటి పోషక విలువలు వున్నాయి ప్రతి ఒక్కరు మునగాకు తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు గర్భవతులు, బాలింతలు, 0-6 సంవత్సరాలపిల్లలు తల్లులు మరియు తండ్రులు, అంగన్వాడీ టీచర్స్, ఆయా లు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాబు..

బద్వేలు, ఏప్రిల్ 18: తప్పిపోయిన బాబును గంటల సమయంలో తల్లిదండ్రులు చెంతకు బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు కొండారెడ్డి, నాగ చిరంజీవి లు అప్పచెప్పారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాయుడు పల్లెకు చెందిన వినోద్ ప్రియాంకల కుమారుడు మన్విత్ 5 సం" నాయుడు పల్లి నుంచి బ్రహ్మంగారి మఠానికి వెళ్లే సమయంలో బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ లో తప్పిపోయి ఆంజనేయ గుడి వద్దకు చేరుకోగా స్థానికులు గమనించి బద్వేలు అర్బన్ పోలీసుల వద్దకు తీసుకు వెళ్లడంతో. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు చిన్నారిని అర్బన్ ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో అప్పజెప్పారు.

## "నీటి సంరక్షణే - సుస్థిర ఆంధ్రకు మార్గం"

### ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పట్ల బాధ్యతతో ముందుకు రావాలి

### స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యసాధనలో ప్రతి పౌరుడి పాత్ర కీలకము

### దువ్వూరులో ఘనంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర కార్యక్రమం

దువ్వూరు ఏప్రిల్ 18
కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షనే సుస్థిర ఆంధ్రకు మార్గమని తెలిపారు.స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రతి పౌరుడి పాత్ర కీలకం అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పట్ల బాధ్యతతో ముందుకు రావాలని తెలిపారు.ప్రతీ నెలా మూడో శనివారం ఒక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ వారం జల హారతి- జలధార థీమ్‌తో కార్యక్రమాన్ని చేస్తున్నాం
వంద రోజుల కార్యాచరణ ద్వారా భూగర్భజలాలు పెంచటంతో పాటు స్వచ్ఛమైన వాతావరణం సాధిద్దాం అని పేర్కొన్నారు.పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, వ్యక్తిగతంగా మరియు సామూహికంగా శ్రమదానం చేయడం ద్వారా "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" సంకల్పాన్ని సాకారం చేయవచ్చని తెలిపారు. "నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తూ, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాలలో శ్రమదానం చేస్తాను. ఈ రోజు నేను వేసిన ముందడుగు ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో దోహదపడుతుందని నమ్ముతున్నాను. ఇకపై నా తోటి వారికి కూడా 'స్వచ్ఛత' పై అవగాహన కల్పిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్ర రాష్ట్రాన్ని అందించేందుకు కట్టుబడి ఉంటాను" అని ప్రమాణం చేస్తున్నానన్నారు.ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వామ్యమవ్వాలని, ప్రతి గ్రామం, ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా సమిష్టి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సంజీవరెడ్డి డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ ఉపాధి హామీ సిబ్బంది సచివాలయ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం

.పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 పట్టణంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో (మెయిన్ స్కూల్) వార్షికోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, 5 సంవత్సరాలు నిండినటువంటి పిల్లలను వెంటనే మెయిన్ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఉపాధ్యాయ బృందం ఇప్పటికే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి 20 అడ్మిషన్లు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, అబ్దుల్ సత్తార్, మాధవిలు మాట్లాడుతూ... ప్రస్తుతం మన పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు వున్నారని, పూర్తిస్థాయి ఇంగ్లీష్ మీడియం బోధన కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన వైశాఖ మాసం పూజా కార్యక్రమం.

బద్వేలు , ఏప్రిల్ 18:నియోజకవర్గం లోని గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు వైశాఖ మాసం ప్రారంభం తో స్వామి అమ్మవారికి వైభవంగా అభిషేకం, రాహుకాలం హోమం,పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది,తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక సంపంగి పూల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, వీడియో కాల్ ధ్వారా పలువురు,ప్రముఖులు సినిమా యాక్టర్ లు వీడియో కాల్ ధ్వారా దర్శించుకున్నారు. తదుపరి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూల విరాట్ అలంకరణ చాలా కన్నులకు కనువిందుగా ఉంది అని స్వామి, అమ్మ వారిని చూస్తూ ఉంటే వారు మా సమస్యలను అడిగి మా సమస్యకు వారు పరిష్కారం తెలిపినట్లుగా మా మనసుకు భావం కలుగుతూ ఉంటుందని వచ్చిన భక్తులు తెలిపారు,స్వామి వారి మాల ధరణ (దీక్ష) స్వీకరించ వలసిన వారు నరసింహ స్వామి ఉపశకుల స్వామి వారిని కలిసి
దీక్ష స్వీకరించ వచ్చు అని తెలిపారు తదుపరి స్వామి వారి మహా పాద యాత్ర ఉంటుంది అని ఆలయ అర్చకులు ఉపశకులు వారు తెలిపారు, తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించారు అన్నదాన కైంకర్యం నిర్వహించిన వారు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్చండి.

### -"బడి పిలుస్తోంది" కార్యక్రమంలో ఉపాధ్యాయులు.



కలసపాడు ఏప్రిల్ 18:
నాణ్యమైన విద్యతో పాటు, క్రమశిక్షణ,నైతికవిలువలు,పెద్దలపట్ల గౌరవం లాంటి విలువలు నేర్పే,సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.మస్తాన్ వలి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.



"బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా శనివారం కలసపాడులోని ఆదర్శప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈఓతో కలిసి ప్రభుత్వపాఠశాల ప్రాధాన్యతను వివరిస్తూ,పిల్లలను చేర్పించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్ వలి, ఉపాధ్యాయులు శేఖర్ బాబు,రమణారెడ్డి, చెన్నయ్య,బాలరాజునాయక్ లు మాట్లాడుతూ,మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే వారికి చదువు చెప్పే బాధ్యత మాది అని హామీ ఇవ్వడంతో పాటు,ప్రభుత్వ పాఠశాలల యందు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు ఉచిత విద్యతోపాటు,ఆహ్లాదకరమైన తరగతి గదులు,నాణ్యమైన సన్న బియ్యంతో కూడిన రుచికరమైన మధ్యాహ్నం భోజనం,మంచి పాఠ్యపుస్తకాలు,వర్క్ బుక్కులు, బ్యాగులు,యూనిఫాం,బూట్లు,రకరకాల ఆట వస్తువులతో పాటు, గ్రంథాలయ పుస్తకాలు,విలువైన బోధనోపకరణాలు,తల్లికి వందనం లాంటి ఎన్నో సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే ఉన్నాయన్నారు.శుభ్రమైన తాగునీరు,పరిశుభ్రమైన మరుగుదొడ్లు,వాటిని శుభ్రపరచడానికి ఆయా లాంటి ఎన్నో సదుపాయాలు ఉన్నందున ఆలోచించి,పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి,వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు చౌడమ్మ,రహమత్ బీ,తల్లిదండ్రులు పాల్గొని,పదిమంది పిల్లలను అడ్మిషన్ చేయించడమైనది.

## నెల్లూరు జిల్లా పోలీస్ శాఖలో పారదర్శక బదిలీలు - 212 మంది సిబ్బందికి మార్పులు

నెల్లూరు ఏప్రిల్ 18:
ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియను జిల్లా ఎస్.పి. డా. అజిత వెజెండ్ల, ఐపీస్ పారదర్శకంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసిన కానిస్టేబుల్ నుండి ఏఎస్సై స్థాయి వరకు మొత్తం 212 మంది సిబ్బందికి మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బదిలీలు చేపట్టారు. సీనియారిటీ, సేవా కాలం, పనితీరు ఆధారంగా నిష్పక్షపాతంగా పోస్టింగులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో సిబ్బంది అభిప్రాయాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. పారదర్శక విధానం వల్ల సిబ్బందిలో నమ్మకం పెరిగిందని, శాఖలో సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఎస్టేట్

ఆదివారం19 ఏప్రిల్ 2026

# మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ వక్రబుద్ధి

## తోలుపునూరి రమేష్ గౌడ్ తీవ్ర ఆరోపణలు -తోలుపునూరి రమేష్ గౌడ్

## బిజెపి ఓ.బి.సి మోర్చా సోషల్ మీడియా కో-కన్వీనర్-మహంకాళి సికింద్రాబాద్ జిల్లా

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బిజెపి ఓ.బీ.సీ మోర్చా సోషల్ మీడియా కో-కన్వీనర్ తోలుపునూరి రమేష్ గౌడ్, మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశపూర్వకంగా ఆపేసిన కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా విమర్శించారు. దక్షిణాది అన్యాయం అనే మూర్ఖ వాదన తో మహిళలకు చేసిన భయంకర అన్యాయాన్ని కపటంగా సమర్థిస్తూ, ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు మహిళలకు ఎన్ని సీట్లు కేటాయించారో కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని, లేకపోతే వారి మొండి ముఖం బయటపడుతుందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు నిజాయితీగా న్యాయం చేయడానికి బిల్లును ఆమోదించిన చర్యను రమేష్ గౌడ్ ప్రశంసించారు. కానీ, దీనికి కూడా కాంగ్రెస్ వ్యతిరేకించడం వారి మహిళా వ్యతిరేక వైరుధ్యాన్ని స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. మహిళలకు అతిపెద్ద మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, బిజెపి త్వరలోనే మహిళా రిజర్వేషన్లను తప్పకుండా పూర్తిగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.మహిళా లోకం మా వెన్నంటే ఉంటే, ఎవరూ మాకు తట్టుకోలేరు అని ఆయన ధైర్యంగా ప్రకటించారు.

రాజ్యాంగం పేరిట ప్రజలను మోసం చేస్తూ, కేవలం రెండు-మూడు రాష్ట్రాల్లో పదవులు వున్న కాంగ్రెస్ త్వరలో అవి కూడా చేజారిపోతారని రమేష్ గౌడ్ హెచ్చరించారు. పార్లమెంట్‌లో బిల్లుకు వ్యతిరేకించి విజయం సాధించాము అని అహంకారం చెప్పుకోవడం సిగ్గుచేటు మాత్రమేనని, ప్రజలు దీన్ని మరచరని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బిజెపికి బలం లేదని కాంగ్రెస్ కలలు కనుక్కుంటున్నారా ఇద్దరు కేంద్ర మంత్రులు ( కిషన్ రెడ్డి, బండి సంజయ్), రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, 8 ఎంపీ లు , 8 ఎమ్మెల్యేలు, నమ్మకమైన మహిళా కార్యకర్తలు, పార్టీ అంటే ప్రాణమిచ్చే అసలైన కార్యకర్తలు మాతోనే ఉన్నారని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్-కూటమి మహిళా రిజర్వేషన్‌పై చేసిన దారుణ అన్యాయాన్ని వివరిస్తామని ఆయన ప్రకటించారు. బిజెపి మహిళల హక్కుల కోసం ఎప్పటికీ పోరాడుతుందని, మళ్లీ వచ్చే సమావేశంలో కూడా మేము మహిళా బిల్లు పెడతామని అప్పుడు కాంగ్రెస్ కు మా బలం చూపుతామని అన్నారు కోట్లాదిమంది మహిళలకు అన్యాయం జరిగిందని దేశంలోని మహిళలందరినీ ఏకం చేసి దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెస్కు మహిళా ఓటు రాకుండా



చేస్తామని తోలుపునూరు రమేష్ గౌడ్ అన్నారు ఇది మీరు సాధించిన విజయం లా చెప్పుకుంటున్నారు కానీ ఇది మహిళలకు జరిగిన అన్యాయంగా మహిళా బిల్లు వచ్చే వరకు మేము ఊరుకునే పరిస్థితి లేదు కాంగ్రెస్కు వారి అనుకూల పార్టీలకు మహిళలకు అన్యాయం జరుగుతే ఎలా ఉంటుందో చూపెడతామని ఆయన అన్నారు.

# మే 27న వైజాగ్ లో వైశ్య అచీవర్స్ అవార్డ్స్ ప్రధానోత్సవ వేడుక

## -వైశ్య అచీవర్స్ అవార్డ్స్ బ్రోచర్ ఆవిష్కరించిన బిగాల గణేష్ గుప్తా

హైదరాబాద్, ఏప్రిల్ 18: సినిమా అవార్డుల ప్రదానోత్సవాల వైభవాన్ని ఆదర్శంగా తీసుకుని, హైదరాబాద్ లో రెండు అద్భుతమైన సీజన్లను విజయవంతంగా నిర్వహించిన తర్వాత, వైశ్య అచీవర్ అవార్డ్స్ (విఏఏ) సీజన్ 3 ఆంధ్రప్రదేశ్ లోని అందమైన విశాఖపట్నంలో మే 27వ తేదీన జరుపుకుంటున్నామని ప్రకటించడానికి మేము ఎంతో సంతోషిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ మడిపడిగే రాజు తెలిపారు. మా ప్రయాణానికి ఒక స్తంభంలా అండగా నిలిచిన మా గౌరవనీయ అతిథి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా పుట్టిన రోజు సందర్భంగా ఈ చారిత్రాత్మక ప్రకటన వెలువడడం మాకు ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో వైశ్య అచీవర్స్ అవార్డ్స్ బ్రోచర్ ను గణేష్ గుప్తా ఆవిష్కరించారు. అనంతరం గణేష్ గుప్తా జన్మదిన వేడుకలను విఏఏ ప్రతినిధులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ వేదికను వివిధ రాష్ట్రాలకు తీసుకువెళ్లాలనే గణేష్ గుప్తా దార్శనికతకు, ఛైర్మన్ రాజు మడిపడిగే, జ్యూరీని



మరియు మొత్తం బృందాన్ని ఈ సందర్భంగా విఏఏ ప్రతినిధులు అభినందించారు. వాసవి కుటుంబానికి ఇది ఒక ద్విగుణీకృత వేడుక..! మేము సీజన్ 3 కోసం మా దార్శనికతను ప్రారంభిస్తున్నాము మరియు ఒక నిజమైన నాయకుడి పుట్టిన రోజును జరుపుకుంటున్నామని రాజు మడిపడిగే తెలిపారు. విశాఖపట్నం మరియు ఇతర ప్రాంతాల విజేతలను సత్కరించడానికి మేము సిద్ధమవుతున్న ఈ తరుణంలో మాతో చేరండి..! అని మడిపడిగే రాజు పిలుపునిచ్చారు. మే 27వ తేదీన విశాఖపట్నం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పక్కన, మధురవాడ, పిఎం పాలెం లోని వి. కన్వెన్షన్ లో జరిగే ఒక అద్భుతమైన వేడుకను వీక్షించడానికి వైశ్యులు అందరూ సిద్ధంగా ఉండాలని అయన కోరారు

# పెద్ద గోల్కొండలో రేషన్ బియ్యం అక్రమ దందాపై దాడులు 1012 బస్తాలు స్వాధీనం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
రంగారెడ్డి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందాపై సివిల్ సప్లై శాఖ అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పెద్ద గోల్కొండ ప్రాంతంలోని గోదాములపై ఎన్ఫోర్స్మెంట్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో భారీగా రేషన్ బియ్యం నిల్వలు బయటపడటం కలకలం రేపింది.
తనిఖీల సందర్భంగా మొత్తం 1012 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఏ. రమేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా ప్రజల కోసం కేటాయించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి మార్కెట్లో విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి అక్రమ చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీజ్ చేసి సంబంధిత కేసులు నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే ఈ అక్రమ దందాలో మరెవరెవరు ప్రమేయం ఉన్నారనే దానిపై లోతైన విచారణ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అక్రమ రేషన్ బియ్యం రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.
ఈ ఆపరేషన్‌లో ఎన్ఫోర్స్మెంట్ ఏపీఓ రమణ, డీటీ రామకృష్ణ, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ కే. మహేష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ జి. జంగయ్య, శంషాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈ దాడులు జిల్లాలో అక్రమ రేషన్ దందాపై గట్టి హెచ్చరికగా మారాయి.



# హిందూ సమ్మేళనానికి కదలి రండి-ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్. హనుమకొండ జిల్లా. 19వ తారీకు ఆదివారం రోజున టీఎన్జీవోస్ కాలనీ పేస్ 2 లో హిందూ సమ్మేళన ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది. సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా ముందుగా విశ్వశాంతి హోమం నిర్వహించడం జరుగుతుంది. తర్వాత హిందూ బంధువుల యొక్క ఐక్యత గురించి వివరించడం జరుగుతుంది ప్రస్తుత సమాజంలో హిందూ బంధువుల యొక్క ఐక్యత ఎంతో అవసరమని వారు ఐక్యంగా ఉంటేనే భవిష్యత్తులో మన తరాలు బాగుంటాయని వారు తెలపడం జరిగింది కావున ఇదో బంధువులందరూ కూడా ఈ యొక్క సమ్మేళనానికి విచ్చేసి పిఎన్జీవోస్ కాలనీ పేస్ 2 లో జరిగే ఎటువంటి ఈ యొక్క హిందూ ధర్మ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది ఇట్టి సమావేశంలో కాలనీ పెద్దలు 17 రెడ్డి గారు రాజిరెడ్డి మల్లారెడ్డి ఫోర్ రెడ్డి సుధాకర్ రెడ్డి రమేష్ రాజు ప్రధాన కార్యదర్శి రాచర్ల కిరణ్ శ్రీధర్ సింగ్ రామ్ రెడ్డి దేవేందర్రావు సుధాకర్ రెడ్డి మరియు కాలనీవాసులు అందరు కూడా పాల్గొన్నారు

# ఏప్రిల్ 20 నుంచి 26 వరకు సంక్షేమ వారం నిర్వహణకు సిద్ధం కావాలి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు.
శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యాసంస్థల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా వసతి గృహాలలో మరమ్మత్తు పనులు చేపట్టి, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రైతు రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సంక్షేమ శాఖల అధికారులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. శ్రీనివాస్, పీడీ డీఆర్‌డీఏ శ్రీలత, సీపీఓ సౌమ్య, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ సుశీందర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు కేషు రామ్, రామేశ్వరీ దేవి, నవీన్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఇబ్రాహీంపట్నంలో ఆగ్రహ జ్వాలలు

## అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ గట్టి హెచ్చరిక

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
ఇబ్రాహీంపట్నం నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి వైఖరిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు అత్యున్నతమని, దానిని అవమానించేలా మాట్లాడడం ఏ మాత్రం సహించబోమని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కఠినంగా ఖండిస్తూ, ఇబ్రాహీంపట్నంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా దిష్టిబొమ్మ దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజల గౌరవాన్ని త్రొక్కేలా మాట్లాడే రాజకీయాలకు ఇక్కడ స్థానం లేదని నాయకులు హెచ్చరించారు.ఈ నిరసన కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే తగిన ప్రతిస్పందన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామనే బలమైన సందేశంగా నిలిచింది. ప్రజల మనోభావాలను దెబ్బతీసే ప్రతి ప్రయత్నానికి గట్టి సమాధానం ఇస్తామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని ఐక్యతను చాటారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో కాంగ్రెస్ ఎప్పటికీ ముందుంటుందని వారు తెలిపారు.



# అత్యవసర న్యూరో కేర్ ప్రభావం, ప్రాణాపాయ స్థితి నుంచి 40 ఏళ్ల వ్యక్తి సురక్షితం

## -ప్రాణాలు కాపాడిన యశోదా వైద్యులు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
హైదరాబాద్ మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మెదడు రక్తస్రావం (హీమరేజిక్ స్ట్రోక్) కేసును వైద్యులు విజయవంతంగా నిర్వహించి 40 ఏళ్ల రోగి ప్రాణాలను కాపాడారు. సమయానికి నిర్ధారణ, న్యూరో క్రిటికల్ కేర్, నిపుణుల సమన్వయంతో ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నారు. రోగి తీవ్రమైన తలనొప్పి, వాంతులతో ఆసుపత్రికి చేరగా, సీటీ స్కాన్‌లో సెరెబెల్లం భాగంలో రక్తస్రావం, మాస్ ఎఫెక్ట్, స్వల్ప హైడ్రోసెఫలస్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఐసీయూలో చేర్చి అత్యవసర చికిత్స ప్రారంభించారు. న్యూరో సర్జన్ శ్రీనివాస్ బొట్ల ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్స అందించింది. రోగికి ముందుగా గుండె సంబంధిత సమస్యలు ఉండటం, యాంటికోగ్యులెంట్ మందులు వాడటం వల్ల చికిత్స క్లిష్టంగా మారినప్పటికీ, న్యూరో, కార్డియాలజీ, క్రిటికల్ కేర్ నిపుణులు కలిసి సమన్వయంతో చికిత్స చేశారు. యాంటికోగ్యులెంట్ మందులను నిలిపివేయడం, పునరావృత సీటీ



స్కాన్‌లు, యాంటీ ఎడిమా, యాంటీఎపిలెప్టిక్ చికిత్సలు, అవసరమైన రక్త మార్పిడి వంటి చర్యలు చేపట్టారు. శస్త్రచికిత్స అవసరం లేకుండా కన్జర్వేటివ్ విధానంలోనే రోగిని కోలుకునేలా చేశారు.
చికిత్స అనంతరం రోగి పూర్తిగా స్పృహను తిరిగి పొందడం, చేతులు కాళ్లు సాధారణంగా కదలించడం, ఆరోగ్య పరిస్థితి స్థిరపడడం వంటి మెరుగుదలలు కనిపించాయి. ఎలాంటి న్యూరోలాజికల్ సమస్యలు లేకుండా రోగిని డిశ్చార్జ్ చేశారు. వైద్యుల ప్రకారం, సెరెబెల్లార్ హీమరేజ్ అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి కాగా, సమయానికి చికిత్స, నిరంతర పర్యవేక్షణ, నిపుణుల సమన్వయం వల్లే ఈ కేసు విజయవంతమైంది. ఈ కేసు ద్వారా ప్రాణాపాయ న్యూరోలాజికల్ పరిస్థితుల్లో న్యూరో క్రిటికల్ కేర్ ప్రాముఖ్యత, మల్టీడిసిప్లినరీ వైద్య విధానం అవసరం స్పష్టమవుతుందని యశోద ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

# తీర్చినా 'క్లోజ్' కాని రుణం

## రైతుకు బ్యాంకుల చుట్టూ తిరుగుడు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
ఇబ్రహీంపట్నం: అప్పు పూర్తిగా చెల్లించినప్పటికీ, ఆన్‌లైన్ రికార్డుల్లో ఇంకా బాకీగా చూపిస్తున్న సమస్యతో ఓ రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామానికి చెందిన రైతు బండ చెన్నయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించి క్లోజ్ చేసినట్లు భావించారు. అయితే, ఇటీవల




ఇతర బ్యాంకుల్లో కొత్త రుణం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, ఆయనకు షాకింగ్ అనుభవం ఎదురైంది. సంబంధిత బ్యాంకుల అధికారులు, పూర్వ రుణం ఇంకా "క్లోజ్" కాలేదని, ఆన్‌లైన్‌లో బాకీగా కనిపిస్తోందని పేర్కొన్నారు. దీంతో చెన్నయ్య తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా ఈ విధంగా బాకీగా చూపించడం వల్ల తనకు కొత్త రుణాలు పొందడంలో ఆటంకం కలుగుతోందని ఆయన వాపోయారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సమస్య తలెత్తిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సంబంధిత బ్యాంకు అధికారులు వెంటనే స్పందించి, తన రుణ ఖాతాను అధికారికంగా "క్లోజ్" చేసి, ఆన్‌లైన్ రికార్డులను సరిచేయాలని చెన్నయ్య డిమాండ్ చేశారు. లేదంటే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి సమస్యలు ఇతర రైతులకు కూడా తలెత్తే అవకాశం ఉందని, బ్యాంకులు రుణాల ముగింపు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

# నవోదయ ఫలితాల్లో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ దూసుకుపోయింది

**-34 మంది విద్యార్థులకు ఉచిత విద్యావకాశం**



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
ఇబ్రహీంపట్నం కేంద్రంగా పనిచేస్తున్న యూనివర్సల్ కోచింగ్ సెంటర్ మరోసారి అద్భుతమైన ఫలితాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. తాజాగా ప్రకటించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ సంస్థ విద్యార్థులు ప్రతిభావంతంగా రాణించి విశేష విజయాన్ని సాధించారు. మొత్తం 34 మంది విద్యార్థులు ఎంపికై ఉచిత విద్యను పొందే అవకాశాన్ని దక్కించుకోవడం విశేషంగా నిలిచింది.
ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ స్థాయి పోటీని ఎదుర్కొని ఈ విజయాన్ని సాధించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గత ఏడు సంవత్సరాలుగా నిరంతరంగా విద్యా సేవలు అందిస్తున్న ఈ కోచింగ్ సెంటర్ తక్కువ ఖర్చుతో నాణ్యమైన బోధనను అందిస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు తోడ్పడుతోంది.
ప్రతి సంవత్సరం నవోదయ, సైనిక్ స్కూల్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షల్లో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులను విజయం వైపు తీసుకెళ్తూ ఈ సంస్థ ముందంజలో కొనసాగుతోంది. ఈ ఏడాది సాధించిన ఫలితాలు ఆ కృషికి నిదర్శనంగా నిలిచాయి.
ఈ విజయంలో భాగమైన విద్యార్థుల్లో మోక్షిత్, ప్రణయ్ రాజ్, జయప్రకాశ్, వైదిక్, ఆదిత్యవర్ధన్, హర్షిత్ తేజ్, అకిరానందన్, సమన్వీ, రిత్విక్, హిమాన్ష, తేజశ్విని, మోక్షజ్ఞ, నిహాళ్, ఆశ్వత్, సాయితనీష్, రేహాన్, హర్షిత్, జ్ఞానేష్, త్రివిక్రమ్, రిత్విక్, సాత్విక్, మోక్ష, అనీష్, సాయిప్రణవ్, వర్షిణి, చిత్రిక్, శ్రీమహా, వైష్ణవి, గౌతమ్, వంధన, చరణ్ తేజ్, గౌతమ్ వర్మ, ప్రణయ్ కుమార్, అభినయా తదితరులు ఉన్నారు. వీరిని తల్లిదండ్రుల సమక్షంలో అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు.
ఈ విజయంతో తల్లిదండ్రుల విశ్వాసం మరింత బలపడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి నవోదయ, సైనిక్ కోచింగ్ తరగతులు మే రెండో వారంలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.
గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి ఉచిత విద్యావకాశాలను అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సరైన దారిలో మార్గనిర్దేశం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కలిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అభిప్రాయపడ్డారు.
అదేవిధంగా ఉపాధ్యాయ బృందం ప్రతి విద్యార్థిలోని ప్రత్యేకతను గుర్తించి, వారి సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తోందని వెల్లడించారు. పాఠ్యాంశాల బోధనతో పాటు పోటీ స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు




# పరిశ్రమలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 18:-
మహేశ్వరం: అగ్నిమాపక సేవల వారోత్సవం2026 సందర్భంగా (18-04-2026) మహేశ్వరం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో మహేశ్వరం జనరల్ పార్క్‌లోని విప్రో పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పరిశ్రమలలో జరిగే అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలలో అగ్నిప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి, ప్రమాదం సంభవించినప్పుడు ఎలా స్పందించాలి వంటి అంశాలపై సిబ్బందికి విపులంగా అవగాహన కల్పించారు. అలాగే బయటపడే మార్గాలు, గుండె-శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) పద్ధతులు, రక్షణ విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.
అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఆందోళన చెందకుండా వెంటనే 101 నంబర్‌కు కాల్ చేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలో పత్రికలు (పాంప్లెట్లు) పంపిణీ చేసి భద్రతా సూచనలు వివరించారు.
జిల్లా అగ్నిమాపక అధికారి-3 జి. మురళి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని పరిశ్రమలు అగ్నిసురక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర అగ్నిమాపక అధికారి జి. నాగార్జున, ప్రధాన అగ్నిమాపక సిబ్బంది పి. సాయి కుమార్, సాంకేతిక అగ్నిమాపక సిబ్బంది బి. నర్సి రెడ్డి, యు. జితేందర్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది జి. పాండు, కె. భాస్కర్, ఎన్. నరేందర్ పాల్గొన్నారు.





